క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలపై ఐక్య పోరాటం



టెక్కలి బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

టెక్కలి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటం చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో టెక్కలి మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యలపై ప్రస్తావన చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్.వి.అనిల్‌కుమార్, బి.నేతాజీ, జి.ధనుంజయ్‌రెడ్డి, శ్రీనివాసరావు, పి.వాణిశ్రీ, మోహన్‌రావు ఉన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం


గుండె పరీక్షలు చేస్తున్న వైద్యులు

టెక్కలి రూరల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా టెక్కలి పోలీసులు మెగా రక్తదాన, వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుసూరుపల్లి రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్య బృందం రోగులను పరీక్షించారు. 256 మందికి గుండె, నేత్ర, ఇతర పరీక్షలు చేశారు. అలాగే రక్తదానం చేసిన వారి నుంచి 52 యూనిట్లను సేకరించినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ రఘునాథరావు, ఎస్‌ఐ-2 రాము, ఏఎస్సై వెంకటరమణ ఉన్నారు.

హెల్పింగ్ సొసైటీ ఆర్థిక సాయం


జానకీరామయ్యకు సాయాన్ని అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు


వజ్రపుకొత్తూరు: గోపినాధపురం గ్రామానికి చెందిన కర్ని జానకీరామయ్య కొబ్బరి చెట్టు పైనుంచి పడిపోవడంతో గాయపడ్డారు. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. ఇతని పరీక్షించి వైద్యులు కిడ్నీలు, లీవర్ సైతం దెబ్బతిన్నట్టు నిర్ధారించారు. దీంతో జానకీరామయ్య కుటుంబం ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ పది వేల రూపాయలను సేకరించింది. ఈ మొత్తాన్ని జానకీరామయ్యకు మంళవారం అందజేసి అండగా నిలిచారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కె.చంటి, సభ్యులు ఎ.గిరి, కీలు కమల, ఎ.శాంతి, కుమార్, రాజేశ్వరి, డిల్లేశ్వరరావు, సాయికుమార్ ఉన్నారు.

విద్యార్థి చదువు కోసం..


ఫీజును చెల్లిస్తున్న స్పందన ఫౌండేషన్ సభ్యులు

సంతబొమ్మాళి: టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇజ్జన జోషికుమార్ చదువుతున్నాడు. విద్యార్థి తండ్రి చనిపోగా..తల్లి దర్జీ పని చేస్తున్నారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న ఈయన బిల్లింగ్ ఫీజు చెల్లించి సహకరించాలని బడేకుప్పన్నపేటకు చెందిన కె.పి.స్పందన ఫౌండేషన్ ప్రతినిధులను కోరారు. దీంతో '' జీవించు-జీవితాన్నివ్వు' నినాదంతో విద్యార్థికి ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. రెండో సంవత్సరం ఫీజు రూ. 13 వేలు, మూడవ సంవత్సరం 15 వేల రూపాయలను మంగళవారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు, సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి, దుంప చంద్రశేఖర్, సింహాచలం, నాగరాజు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి సన్నిధిలో అన్నదానం


అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి అమ్మవారి సన్నిధిలో మంగళవారం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. సుమారు 300 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో వి.రాధాకృష్ణ తెలిపారు. అన్నదానానికి విరాళాలు ఇవ్వాలనుకునే భక్తులు తమను సంప్రదించాలని ఈవో కోరారు.

శిథిలబడిలో చదువులెలా?

- 'నాడు-నేడు'లో కొన్ని పాఠశాలలకు మహర్దశ
- పాఠశాలలపై దృష్టిసారించని కూటమి సర్కార్

నందిగాం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలను ఎదుర్కొంటుంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. నాడు-నేడు పథకంతో అనేక పాఠశాలల రూపురేఖలు మారాయి. అయినా కొన్నిచోట్ల పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. నందిగాం మండలంలో ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ, భయాందోళన మధ్య చదువులు సాగిస్తున్నారు. మండల వ్యాప్తంగా 76 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, 14 ఉన్నత, రెండు గిరిజన ఆశ్రమ, ఒక కేజీబీవీ, ఒక గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పోలవరం, గొల్లబంజీరుపేట, ఉయ్యాలపేట, పాలవలసపేట, పాలవలస, మెండ్రాయివలస, పెంటూరు, కవిటి అగ్రహారం తదితర 12 పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని భవనాలు పెచ్చులూడిపోయి దర్శనం ఇస్తున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 4,771 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే విశాల మండలంలో గ్రామాల మధ్య దూరం కూడా ఎక్కువగా ఉండటం వలన ఏ గ్రామ విద్యార్థులు అదే ఊరులోని పాఠశాలలకు మాత్రమే వెళ్లగలిగే పరిస్థితి. దీంతో కొన్ని గ్రామాల్లోని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని విడిచిపెట్టి అద్దె భవనాల్లో పాఠశాలను నడుపుతున్నారు. మరి కొన్ని పాఠశాలల్లో వర్షాలు పడితే నీరు కారడం, పెచ్చులూడటంతో అలాంటి రోజుల్లో గ్రామాల్లోని మండపాల మీద పాఠాలు చెప్పవలసి వస్తుంది. మండలంలో అధికంగా రైతాంగం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న నేపథ్యంలో చిన్నారులకు వేరే ప్రత్యామ్నాయం లేక ఆ శిథిల భవనాలల్లోనే భయం భయంగా విద్యను అభ్యసిస్తున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం మొదటి దశలో 35 పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే రెండవ దశలో 28 పాఠశాలలను ఆధునీకరించారు. గతంలో మండలంలో మూసివేసిన సింగుపురం, మద్దిలివానిపేట, పాలవలస గ్రామాల్లో మరలా పాఠశాలలు తెరిచి ఆయా గ్రామాల చిన్నారులకు విద్యను అందుబాటులోకి తెచ్చారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాల కారణంగా సర్కార్ బడుల్లో ప్రవేశాలు సైతం గణనీయంగా పెరిగింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంత వరకు పాఠశాలలపై దృష్టి పెట్టకపోవడం, విద్యకు సంబంధించిన పథకాలు అందజేయకపోవడం, శిథిలావస్థలో ఉన్న భవనాలను మరమ్మతులు చేయడం, లేదా కొత్తవి నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా ఉన్నతాధికారులు పటిచుకోకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మండలస్థాయి అధికారులు ఉన్నతాధికారులకు పూర్తి సమాచారం అందించి చిన్నారులకు పూర్తి ఆహ్లాదకర వాతావరణలో చదువులు సాగేలా చూడాలని కోరుతున్నారు.



నాడు-నేడులో కొత్తరూపు సంతరించుకున్న పెద్దతామరాపల్లి పాఠశాల


పోలవరంలో అద్దె భవనంలో నడుస్తున్న పాఠశాల


పెచ్చులూడిన కవిటిఅగ్రహారం పాఠశాల భవనం

ఉన్నతాధికారులకు తెలియజేశాం



నందిగాం మండలంలో 12 పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని కూల్చివేయడానికి అనుమతుల కోసం ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేసి ఉన్నాం. వీటి స్థానంలో కొత్త భవనాల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు, ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైతే నిర్మాణాలు చేపడతాం.

-జి.నర్సింహులు,
మండల విద్యాశాఖాధికారి, నందిగాం

అధికారుల తనిఖీలు



వజ్రపుకొత్తూరు మండలంలోని పూండి, బెండిగేటు తదితర ప్రాంతాల్లో బాణసంచా విక్రయ దుకాణలను ఏర్పాటు చేశారు. వీటిలో పలాస జీఎస్టీ అధికారి కె.భార్గవ్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనల మేరకు కొనుగోలు చేసిన క్రాకర్స్‌కు జీఎస్టీ చెల్లించారో లేదో బిల్లులను పరిశీలించారు. బిల్లులకు స్టాక్ పాయింట్‌లో ఉన్న మందుగుండు సామగ్రిని సరిపోల్చారు. పూండిలోని ఐదు, బెండిగేటు, వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు.

-వజ్రపుకొత్తూరు

సగంలో వదిలేశారు..



కంచిలి మండల కేంద్రంలో జాతీయ ఉపాధిహామీ పథకం, వైఎస్సార్ క్రాంతి పథం విభాగాల పరిధిలో సేవలందించేందుకు వీలుగా రూ. 25 లక్షల పంచాయతీరాజ్ శాఖ నిధులతో భారత నిర్మాణ రాజీవ్ గాంధీ సేవా కేంద్రం భవనాన్ని నిర్మించాలని భావించారు. అయితే భవన నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. 2011లో భవనం మంజూరైనప్పటికీ.. తర్వాత కాలంలో పలుసార్లు నిర్మాణం పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలందినప్పటికీ స్థానిక అధికారులు పెద్దగా దృష్టిసారించలేదు. ఫలితంగా ఉపాధిహామీ పథకం కార్యాలయం ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు.

-కంచిలి

ప్రమాదం సుమా..



పలాస రైల్వేస్టేషన్ నుంచి బయటకు వచ్చే ప్రాంతంలో బీటీ రోడ్డు కల్వర్టు పాడై పెద్ద రంధ్రం ఏర్పడింది. ఇదే మార్గంలో వాహనదారులు, పాదచారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా గోతులో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రైల్వే అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

-కాశీబుగ్గ

నిబంధనలకు విరుద్ధంగా.. బాణసంచా దుకాణాల ఏర్పాటు!

టెక్కలి: దీపావళి సందర్భంగా డివిజన్ కేంద్రమైన టెక్కలిలో తాత్కాలిక బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించలేదనే విమర్శలు వస్తున్నాయి. ఎనిమిది దుకాణాల ఏర్పాటుకు అధికారులు లైసెన్సులు మంజూరు చేశారు. అయితే ఆయా దుకాణాలు పట్టణానికి శివారుగా.. ఎటువంటి ఇబ్బందుల్లేని ప్రదేశంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అధికారులు వీటిని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా అనుమతులు మంజూరు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో అగ్నిమాపక సిబ్బంది కీలకంగా నిబంధనలు పక్కదారి పట్టించేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా తాత్కాలిక బాణసంచా దుకాణం కోసం దరఖాస్తు చేసుకుంటే, ఏర్పాటు విషయంలో పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో స్థల పరిశీలన, ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆయా ప్రాంతంలో ప్రాణ, ఆస్తి నష్టం ఉండకుండా నిబంధనలు పాటించే విధంగా అనుమతులకు ఎన్‌ఓసీ జారీ చేయాలి. అయితే ఇక్కడ అటువంటి పరిస్థితులు కనిపించడం లేదు. విద్యా సంస్థలు, వాణిజ్య, ఇళ్ల సముదాయాల నడుమ దుకాణాల ఏర్పాటుకు అధికారులు అనుమతులు మంజూరు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

ప్రజాస్వామ్యంపై అవగాహన

నందిగాం:

విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం ఉంచి, అవగాహన పెంపొందించుకోవాలని లఖిదాసుపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల నిర్వహించే ప్రక్రియపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా విద్యార్థులే నాయకులుగా, ఓటర్లుగా, ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తూ మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. దేశ్ ఆవాన్ సహయోగ్ ఫౌండేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామని సోషల్ ఉపాధ్యాయురాలు బి.రత్నం తెలిపారు.

ప్రజాసమస్యలపై విద్యార్థులు స్పందించాలి

ఇచ్ఛాపురం: విద్యార్థి దశనుంచే ప్రజాసమస్యలపై విద్యార్థులు స్పందించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం అన్నారు. అక్టిజన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఇందులో పాల్గొన్నారు. ఎన్నిక ప్రక్రియలో చైర్మన్‌గా ఎ.నారాయణ బెహర, వైస్‌చైర్మన్‌గా ఎస్.కౌసిక్ ఎన్నికవ్వగా.. వారిని పాఠశాల సిబ్బంది అభినందించారు.


ఇచ్ఛాపురం: నారాయణ బెహరను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

అవినీతిమయంగా టౌన్‌ప్లానింగ్ విభాగం

- మున్సిపల్ సమావేశంలో సభ్యుల ఆరోపణ


మున్సిపల్ సమావేశానికి హాజరైన సభ్యులు


టౌన్‌ప్లానింగ్‌పై చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ గిరిబాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కోఆప్షన్ సభ్యుడు సంతోష్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోందని కౌన్సిలర్లు ఆరోపించారు. కోట్ల రూపాయల ఆదాయం తెచ్చిపెట్టే టౌన్ ప్లానింగ్ అత్యంత అవినీతి మయంగా మారిందన్నారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సమావేశం మంగళవారం జరిగింది. కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. జంట పట్టణాలలో బహుళ అంతస్తుల నిర్మాణాలలో అనుమతులు, తనిఖీలు దందాగా మారాయన్నారు. ఇప్పటి వరకు 50కుపైగా భవనాలు అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగాయని అన్నారు. ఒక్కో భవన నిర్మాణానికి లక్షలాది రూపాయలు చేతుల మారాయని.. ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు తీవ్రస్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయాన్ని వదిలేసి రూ.లక్షలలో ఫైన్‌ల పేరుతో నడిపిస్తున్నారని అన్నారు. కనీస నియమ నిబంధనలు, అనుమతులు లేకుండా నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయని.. అధికారులు ఎందుకు పర్యవేక్షించడం లేదన్నారు. టౌన్ ప్లానింగ్‌పై చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ గిరిబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ రామారావు మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్‌లో జరుగుతున్న అంశాలు వాస్తవమేనన్నారు. ఇకపై జరగకుండా చర్యలు చేపడతామని చెప్పారు. సుడా అనుమతులతో కొన్ని నిర్మాణాలు జరుగుతున్నాయని.. తమ పరిధిలో అవిలేవని అన్నారు. మున్సిపల్ చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్‌లో లోపాలను కొంత మంది క్యాష్ చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికే కోర్టులో 60 కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. అటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌన్సిలర్ సనపల సింహాచలం మాట్లాడుతూ.. శానిటేషన్ సిబ్బంది రోజూ ప్రైవేటు సంస్థల వద్ద డబ్బులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ వారికి జీతాలు చెల్లించడం లేదా అని ప్రశ్నించారు. 17వ వార్డు పరిధిలోని సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ మిషనరీ మరమ్మతులకు గురికావడంతో రెండు నెలలుగా సేవలు నిలిచిపోయాయని అన్నారు. కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, శంకర్ పండాలు మాట్లాడుతూ.. కార్తీక మాసం నేపథ్యంలో చెరువులు, పార్కులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిబంధనలు సవరించాలి

టెక్కలి: పీఎం కిసాన్ పథకంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నిబంధనలను సవరించాలని సామాజిక కార్యకర్త జి.అప్పన్న కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా ఏటా ఆరు వేల రూపాయలు రైతులకు అందుతున్నాయన్నారు. అయితే ఇప్పుడు 2018 నుంచి 2019 వరకు భూమి ఎవరి పేరుతో ఉంటే వారికే పథకం వర్తిస్తుందనే నిబంధనలు తీసుకురావడంతో చాలామంది నష్టపోతారన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంత్యుత్సవం


కోటబొమ్మాళి: ధన్వంతరీకి పూజలు చేస్తున్న దృశ్యం

టెక్కలి: ధన్వంతరి జయంతిని నాయీబ్రాహ్మణులు టెక్కలిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాయీబ్రాహ్మణులు ధన్వంతరిని ఆరాధ్యదైవంగా భావిస్తారు. ఇందులో భాగంగా స్థానిక పీఎం విశ్వకర్మ శిక్షణ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో పలు మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణులంతా ధన్వంతరి చిత్రపటానికి నివాళులర్పించారు.

కోటబొమ్మాళి: స్థానిక నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో ధనత్రయోదశిని పురస్కరించుకొని ధన్వంతరి జయంతిని జరుపుకున్నారు. జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

పలాస: బాల కార్మికులను దుకాణాల్లో పనుల కోసం పెట్టుకునే సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ కార్మిక సంక్షేమ అధికారి మట్ట విజయకుమార్ చెప్పారు. కాశీబుగ్గ, పలాస పట్టణాల్లోని పలు దుకాణాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. కాశీబుగ్గ కె.టి.రోడ్డు నుంచి పలాస వరకు దుకాణాలను పరిశీలించారు. బాలలను పనుల్లో పెట్టుకోవద్దని దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. పలాస రైల్వే స్టేషన్‌లో కూడా తనిఖీలు చేశారు. కార్యక్రమంలో సి.ఆర్.ఎం.టి ఉర్మాన అప్పలరాజు, చైల్డ్ లైన్ ప్రతినిధి సుజాత, కాశీబుగ్గ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

వజ్రపుకొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికను బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు మంగళవారం తెలిపారు. పంచాయతీల వారీగా ఈ నెల 15 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన సామాజిక తనిఖీల నివేదికను ప్రజావేదికలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

ఆర్డీవో వెంకటేష్ బాధ్యతల స్వీకరణ


ఆర్డీవో వెంకటేష్‌ను అభినందిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస రెవెన్యూ డివిజన్ అధికారిగా నియమితులైన గ్రంధి వెంకటేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన భరత్‌నాయక్ బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో సుదర్శనదొర విధుల్లో చేరారు. అయితే కొద్దిరోజుల్లోనే సుదర్శనదొర గుండెపోటుకు గురయ్యారు. దీంతో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఇప్పుడు తాత్కాలిక ప్రాతిపదికన అనంతపురం జిల్లాలో ఆర్డీవోగా, గత ప్రభుత్వంలో ఐటీ మంత్రి ఓఎస్‌డీగా పనిచేసిన వెంకటేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసింది.

సంక్షిప్తంగా...

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

కాశీబుగ్గ: కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాల దర్శనానికి వెళ్లే భక్తుల కోసం పలాస ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు డీఎం ఆర్.సీతారామనాయుడు మంగళవారం తెలిపారు. పంచారామాలైన అమరేశ్వరస్వామి (అమరావతి), సోమేశ్వరస్వామి (భీమవరం), క్షీర రామలింగేశ్వరస్వామి (పాలకొల్లు), భీమేశ్వరస్వామి (ద్రాక్షారామం), కుమారరామ భీమేశ్వరస్వామి (సామర్లకోట) శైవ క్షేత్రాలకు ప్రతీ కార్తీక సోమ వారం ముందర ఆదివారం పలాసలో మధ్యాహ్నం రెండు గంటలకు బస్సులు బయలుదేరి వెళ్తాయన్నారు. ఎక్కువ మంది బస్సును పూర్తిగా బుక్ చేసుకుంటే వారి ఇంటి వద్దకు బస్సును పంపిస్తామన్నారు. నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో బస్సులను నడుపుతామన్నారు. ఒక్కో ప్రయాణికుడికి పలాస నుంచి సూపర్‌లగ్జరీ రూ.2,700, అల్ట్రా డీలక్స్ రూ.2,650, ఎక్స్‌ప్రెస్ రూ.2,250 టికెట్ ధరగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. వివరాలకు 99592 25610, 73829 24758 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు మంగళవారం తెలిపారు. బస్‌స్టాండ్‌కు సమీపంలోని ఖాళీ స్థలంలో పేకాట ఆడుతుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 10,340 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కాశీబుగ్గ సీఐ దాడి మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారం సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. 23 వార్డులకు చెందిన కౌన్సిల్ సభ్యులందరూ విధిగా హాజరు కావాలని కోరారు.

వరిపైరును నాశనం చేస్తున్న అడవి పందులు

సోంపేట: వరిపైరును అడవి పందులు నాశనం చేస్తున్నాయని జలంతర సోంపేట, బారువ గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయాధికారుల వద్ద వాపోయారు. బారువ, సోంపేట పంచాయతీల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మంగళవారం నిర్వహించారు.

తొమ్మిది బాణసంచా దుకాణాలకు లైసెన్స్‌లు

పలాస: పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పలాస మండలానికి సంబంధించి బాణసంచా దుకాణాల ఏర్పాటు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తొమ్మిది దుకాణాల ఏర్పాటుకు లైసెన్స్‌లు మంజూరు చేసినట్టు తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి మంగళవారం తెలిపారు. వీటిని బ్రాహ్మణతర్లా, కాశీబుగ్గ, శాసనాం, కిష్టుపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారన్నారు.

నేడు పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్ర కార్యాలయం ఆవరణలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కాశీబుగ్గ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మోహనరావు మంగళవారం తెలిపారు.

విత్తనాల కోసం పేర్ల నమోదు

నందిగాం: రబీ సీజన్‌లో అపరాలు, రాగుల విత్తనాల కోసం వీఏఏల వద్ద రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్ వర్మ సూచించారు.

గెస్ట్ అధ్యాపకుని ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

కాశీబుగ్గ: మందసలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ సబ్జెక్టు బోధనకు అతిథి (గెస్ట్) అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హత ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ బి.తేజేశ్వరరావు కోరారు. నవంబర్ ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు తక్కువ కాకుండా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. రెండో తేదీన నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో దరఖాస్తుదారులు హాజరు కావాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాశీబుగ్గ: రెంటికోటలోని బొమ్మాళి రామయ్యకు చెందిన 35 గొర్రెలు, మేకలను దొంగలు అపహరించుకుపోయారు. దీంతో బాధిత కుటుంబాన్ని పలువురు నాయకులు మంగళవారం పరామర్శించారు. రాష్ట్ర బీసీ సెల్ నాయకులు లోడగల కామేశ్వరరావు, కాష్యూ లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పారు.

స్కూటీ చోరీపై ఫిర్యాదు

కాశీబుగ్గ: ఇంటి వద్ద ఉంచిన స్కూటీ చోరీకి గురైందని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సూదికొండకు చెందిన చల్లా సంతోష్ కాశీబుగ్గ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి సమయంలో పార్క్ చేసి ఉంచిన స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు పోలీసులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరుతడి పంటలతో అధిక ఫలసాయం

కవిటి: రబీ సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలసాగుతో అధికలాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. బట్టివానిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వరిపైరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పైరును ఆశించిన సుడి దోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. రబీ సీజన్‌లో నువ్వులు,రాగులు విత్తనాలు సబ్సిడీ ద్వారా సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయ సహాయకులు బెందాళం కల్యాణ్, వెటర్నరీ అసిస్టెంట్ నీలవేణి ఉన్నారు.